బుధ వారం
17-01-2024
సంపుటి - 09,
సంచిక - 432
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra
Pradhesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

జాతీయ తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## ఆర్టీసికి కలిసివచ్చిన సంక్రాంతి రద్దీ

ఒక్కరోజే 12 కోట్ల ఆదాయం రాక ● 9కోట్లు దాటిన మహిళల జీరో టిక్కెట్లు



**హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం):** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలు భారీ సంఖ్యలో తమ సొంతూళ్లకు తరలివెళ్లారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు కూడా వెళ్లిపోయారు. ప్రజలు తమ సొంతూళ్లకు వెళ్లేందుకు టీఎస్ ఆర్టీసీ బస్సులను వినియోగించుకున్నారు. 13వ తేదీన 52.78

3వ పేజీలో...

---

## శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

రెండురోజులు భారీగా తరలివచ్చిన నగరవాసులు ● ఆకట్టుకున్న బసవన్నలు, హరిదాసుల సంకీర్తనలు

**హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం):** పల్లె సొగసులు... ప్రకృతి అందాలతో నగర ప్రజలకు ఓ గ్రామీణ ప్రాంతంగా ఆకట్టుకుంటున్న శిల్పారామంలో సంక్రాంతి సందడి నగరవాసులను ఆకట్టుకుంది. పల్లెలకు వెళ్లలేకపోయిన పట్టణవాసులు సంక్రాంతి వేడుకలను ఇక్కడ ఆస్వాదించారు. భోగిమంటలు, రంగురంగుల రంగవల్లికలతో శిల్పారామం స్వాగతం పలుకింది. బసవన్నల నృత్యాలు,



3వ పేజీలో...

---

## పుట్టపర్తి చేరుకున్న ప్రధాని మోడీ

లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ప్రధాని

**అనంతపురం, జనవరి 16 (సమ సమాజం):** ప్రధాని నరేంద్రమోదీ ఏపీ పర్యటనలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. ప్రధాని మోదీ ఎయిర్ పోర్ట్ నుంచి లేపాక్షి ఆలయానికి వెళ్లారు. అక్కడ వీరభద్రస్వామికి ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంగా స్వామి వారికి హారతి ఇచ్చిన ప్రధాని మోదీ.. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీరామ్ జైరామ్ అంటూ భజన పాటలు సైతం భక్తి భావంతో పాడారు. ఈ



3వ పేజీలో...

---

## సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోండి

### సంక్షోభ వార్తలపై కెటిఆర్ స్పందన



**హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం):** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై వస్తున్న సంక్షోభ వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లకుండా గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే, కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల్లో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎంతగానో

3వ పేజీలో...

---

## ఎపి పిసిసి చీఫ్‌గా వైఎస్ షర్మిల

నియామకపు ఉత్తర్వులు జారీ

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆహ్వానితుడిగా రుద్రరాజు

**న్యూఢిల్లీ, జనవరి 16 (సమ సమాజం):** ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిలను కాంగ్రెస్ హై కమాండ్ నియమించింది. కాంగ్రెస్ అధిష్టానం ఓ ప్రకటనలో ఈ విషయం తెలిపింది. పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు ఒకరోజు ముందే పదవీకి రాజీనామా సంగతి తెలిసిందే. గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియామించింది. షర్మిల పార్టీలో చేరే సమయంలోనే పదవీ వీడేందుకు సిద్ధమని రుద్రరాజు ప్రకటించారు. షర్మిల ఇటీవల తన పార్టీ వైఎస్ఆర్ టీపీని కాంగ్రెస్ పార్టీలో




3వ పేజీలో...

# ఇడి విచారణకు రాలేనన్న కవిత

## నోటీసులపై ముందస్తుగా సమాచారం

**హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం):** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో విచారణను వేగవంతం చేసిన ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ ఎమ్మెల్సీ కవితకు ఈడీ సమన్లు జారీచేసింది. జనవరి 16న విచారణకు హాజరు కావాలని నోటీసులలో పేర్కొంది. అయితే ఈడీ విచారణకు మంగళవారం హాజరు కావడం లేదంటూ ఎమ్మెల్సీ కవిత ఈడీకి లేఖ రాశారు. ఈ మెయిల్ ద్వారా ఈడీ అధికారులకు కవిత ముందస్తుగా సమాచారం ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ కేసు పెండింగ్ లో ఉందని ఈడీకి ఆమె గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితను ఈడీ మరోసారి విచారించనుంది. అందులో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ కూతూరు, ఎమ్మెల్సీ కవితకు ఈడీ సమన్లు జారీ చేసింది. ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం16న విచారణకు రావాలని కవితకు జారీ చేసిన నోటీసులలో ఈడీ పేర్కొంది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహా ఆమ్ ఆద్మీ పార్టీ నేతల మెడకు చిక్కుకున్న ఈ ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితను ఈడీ పలుమార్లు విచారించింది. తెలంగాణ ఎన్నికల సమయంలో కవితను అరెస్ట్ చేస్తారని సైతం ప్రచారం జరిగింది. కానీ విచారణలో భాగంగా కవిత ఈడీ అధికారులకు సహకరించి, వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈడీ ఆదేశాల మేరకు ఆమె వినియోగించిన ఫోన్లు, ఇతర పరికరాలు సైతం సబ్మిట్ చేయడం తెలిసిందే. చాలా రోజుల విరామం తర్వాత ఢిల్లీ లిక్కర్ కేసులో విచారణకు హాజురు కావాలని కవితకు ఈడీ సమన్లు జారీ చేయడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఢిల్లీ



4వ పేజీలో...

## పశుసంవర్ధక శాఖ ఫైల్లు మాయం

కేసును ఎసిబికి అప్పగించిన ప్రభుత్వం




**హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం):** నాంపల్లిలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో కీలకమైన ఫైల్స్ మాయమైన ఘటనను ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. అంతేకాకుండా గొర్రెల పంపిణీలో జరిగిన అక్రమాలపై ఫోకస్ పెట్టింది. ఈ రెండు కేసులును ఏసీబీకి బదిలీ చేస్తూ రాష్ట్ర సర్కార్

4వ పేజీలో...

---

## ఊరించనున్న నిర్మల మధ్యంతర బడ్జెట్

మహిళలు, రైతులను ఆకట్టుకునేలా ప్రణాళిక

వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా అడుగులు



**న్యూఢిల్లీ, జనవరి 16 (సమ సమాజం):** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి1న మధ్యంతర బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఇది మోదీ ప్రభుత్వ రెండో హయాంలో మధ్యంతర బడ్జెట్ కావడంతో.. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇది మధ్యంతర బడ్జెట్ కావడంతో పెద్దగా కేటాయింపులు ఉండకపోవచ్చు. అయినా ఉన్నంతలో ఆకర్షక

3వ పేజీలో...

# దావోస్‌లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

## పలువురు ప్రముఖులతో సిఎం రేవంత్ చర్చలు



**హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం):** ఇన్వెస్ట్ ఇన్ తెలంగాణ పేరుతో చేపట్టిన క్యాంపెయిన్‌ను ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా తెలంగాణ ప్రభుత్వం విజయవంతంగా ప్రారంభించింది. సోమవారం దావోస్ చేరుకున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పలువురు ప్రముఖులతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నాలు మొదలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఉన్నారు. అధికారులు కూడా పర్యటనలో భాగమయ్యారు. అంతా కలిసి ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. దావోస్ చేరుకున్న వెంటనే రేవంత్ బృందం ఇథియోపియా డిప్యూటీ ప్రైమ్ మినిస్టర్ డెమెక్ హసెంటోతో సమావేసమైంది. పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న రూట్ మ్యాప్ ఆయనతో చర్చించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రెసిడెంట్ బోర్గ్ బ్రెండేతో కూడా సమావేశమ య్యారు. ఇతర ప్రముఖులతో కూడా భేటీ అయ్యారు. తెలంగాణ ఏర్పడిన కొత్త ప్రభుత్వ ఆలోచనలు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం సృష్టించడంలో చేపట్టబోయే కార్యక్రమాలు వివరించారు. స్విట్జర్లాండ్‌లోని జూరిచ్ విమానాశ్రయంలోనే ప్రవాసీ తెలంగాణ ప్రముఖులతో రేవంత్ టీం చర్చలు జరిపింది. సమ్మిళిత, సంతులిత అభివృద్ధి ద్వారా ప్రజలందరి పురోగతి కోసం నవ తెలంగాణ నిర్మాణంలో భాగమయ్యేందుకు వారంతా మొగ్గు చూపారని సిఎం రేవంత్ తెలిపారు. తెలంగాణలో ఉన్న వనరులు పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని పారిశ్రామికవేత్తలకు వివరించనున్నారు. భారీ పెట్టుబడుల లక్ష్యంగానే ఈ టూర్ ఉంటుందని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. దావోస్‌లో మూడు రోజుల పాటు 54వ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు జరగనుంది. దావోస్ పర్యటనలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బిజీగా

3వ పేజీలో...

# మోడీ రాజకీయ కార్యక్రమంగా అయోధ్య

అందుకే హాజరు కావడం లేదన్న రాహుల్ ❑ నాగాలాండ్ చేరుకున్న న్యాయయాత్ర

**న్యూఢిల్లీ, జనవరి 16 (సమ సమాజం):** రామ మందిర శంకుస్థాపన కార్యక్రమాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ సొంత పంక్షన్ లాగా నిర్వహిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇది ప్రధాని మోదీ చుట్టూ తిరిగే ఓ రాజకీయ కార్యక్రమం అని తాము భావిస్తున్నామని చెప్పారు. అందువల్లే తాము ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదని తెలిపారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా నాగాలాండ్ లో రాహుల్ పర్యటించారు. జనవరి



22న జరగనున్న రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు హాజరుకాకపోవడంపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర నాగాలాండ్‌కు చేరుకుంది. నాగాలాండ్ రాజధాని కోహిమాలో యాత్ర చేపట్టారు. రామమందిరం ప్రారంభోత్సవంపై ఆయన తొలిసారి స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన రాజకీయ కార్యక్రమం అని ,

3వ పేజీలో...

# పల్లెల్లో సరదాగా సంక్రాంతి వేడుకలు !

సంక్రాంతి అంటేనే సరదా అన్న రీతిలో పండుగ సాగింది. ప్రజలంతా అష్టకష్టాలు పడి సొంతూళ్లకు వెళ్లి పండగ చేసుకున్నారు. గతంలో కరోనా భయాల మధ్య సాగిన పండగ ఇప్పుడు సరదాగా సాగింది.ఆధునిక జీవనాన్ని అలవాటు చేస్తోన్న పట్టణీకరణ...కార్పొరేటీకరణ దెబ్బకు పల్లెలు, అచ్చ తెలుగు సాంప్రదాయాలు కనుమరుగవుతున్న వేళ ప్రజలంతా గ్రామాలకు తరలి నిత్యంఉండే బాధలనుంచి ఉపశమనం పొందారు. సంక్రాంతి కర్షకుల పండగ. ఆరుగాలం కష్టించిన ఫలితాన్ని నట్టింట నింపుకునే పండుగ. ఈ పంటల పండుగను దేశంలోని అనేకచోట్ల అనేక పేర్లతో, ప్రాంతాల వారీగా విభిన్నమైన రీతుల్లో వైవిధ్యభరితంగా జరుపుకున్నారు. ప్రతి ఇల్లూ పచ్చని తోరణమై, వీధి వీధీ జన సందోహమై, ప్రతి హృదయం ఆనందాల హరివిల్లయి, పట్టణ ప్రజలంతా పల్లెలకు తరలడంతో ఆనందం వెల్లివిరిసింది. ఒకచోట చేరి సంతోషాల్ని కలబోసుకుని సంబరం చేసుకున్నారు. సంస్కృతిని ప్రతిబింబించేవి పండుగలే. ఈ పండుగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. తెలుగునాట సంక్రాంతిని ముఖ్యమైన పండుగగా చెప్పుకోవచ్చు. తెలుగునాట సంక్రాంతి, తమిళనాడులో పొంగల్, కేరళలో 'ఓణం' ఇటువంటి పండుగే. కన్నడ, మరాఠీ ప్రజలు కూడా ఈ పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఇది పంటల పండుగ. పంట రైతు ఇంటికి చేరి ప్రతి ఇల్లు ధాన్యలక్ష్మితో కళకళలాడే సమయం ఇది. మొదటిరోజు భోగి, రెండవ రోజున సంక్రాంతి, మూడవ రోజున కనుమ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. సంక్రాంతి అంటే భోగి మంటలు, పాడిపంటలు, పిండి వంటలు మాత్రమే కాదు... రంగురంగుల ముగ్గులతో, పువ్వులు అలంకరించిన గొబ్బెమ్మలతో, హరిదాసు పాటలు, గంగిరెద్దుల ఆటలు, పతంగాల రెపరెపలు, కోడి పందేలు, కోలాటాలు, పిల్లల కేరింతలు, బంధు మిత్రుల పరామర్శలతో గ్రామాలు పంచరంగుల హరివిల్లుగా కనిపించింది. ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులతో స్వాగతం పలికాయి. గొబ్బిపాటల కోలాహలం, కోడిపుంజుల పోట్లాటలు, గంగెద్దుల హడావిడి తెలుగు లోగిళ్లలో సందడి చేశాయి. ఇకపోతే ఆంధ్రాలో కోడిపందాలు ఆగలేదు. తమిళనాట జల్లికట్టు ఆగలేదు. కేసులు, బైండోవర్లు,నిఘా మాటున కోడిపందాలు జోరుగా సాగాయి. కోడి పందాల మాటున కోట్లు చేతులు మారాయి. కోడిపందాలపై ఆంక్షలు ఉన్నా ప్రజలు తమకు నచ్చిన విధంగా పండగ చేసుకున్నారు. తెలంగాణలో మద్యం ఏరులై పారింది. పంతగుల జోరూ కొనసాగింది. పతంగులను ఎగరేయడం హైదరాబాద్‌లో కోలాహలంగా సాగింది. హైదరాబాద్ కైట్ ఫెస్టివల్ ఆనందంగా సాగింది. అయితే చైనా మంజాకు ఒక సైనికుడు, మరో ఇద్దరు పతంగులు ఎగరేస్తూ చనిపోవడం విషదంగా మిగిల్చింది. ఇక ఆంధ్రాలో మొత్తంగా రాజకీయ నేతలు కోరుకున్న విధంగా పందాలు సాగిన తీరుతో సంక్రాంతి ఎంజాయ్ చేశారు. ఏటా కోడిపందాల కోసం కోర్టుల చుట్టూ తిరిగే అవస్థ లేకుండా కోడి పందాలను జరుపుకున్నారు. ఇకపోతే కొందరికి సంక్రాంతి అంటే జూదం, తాగుడు, కోడిపందేలే అన్నట్టుగా ప్రజాప్రతినిధులే దగ్గరుండి నిర్వహించడమనే సంస్కృతి ఏయేటికాయేడు పెరుగుతోంది. పోలీసులు ఎంతగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నా కోస్తా బరుల్లో పందెం కోళ్లు కత్తులు దూశాయి. ఎట్టి పరిస్థితుల్లో కోడిపందేలు నిర్వహించేందుకు వీలులేదంటూ పోలీసులు చేసిన హెచ్చరికలు గాలిలో కలిసిపోయాయి. ప్రజాప్రతినిధుల అండతో కోడిపందేలు పెద్దఎత్తున చేపట్టారు. సంప్రదాయం ముసుగులో నిర్వహించిన పందేల్లో వేలాది కోళ్లు నేలకొరిగాయి. ఇదే సందర్భంలో పందెంరాయుళ్లు చెలరేగిపోయారు. పందాల్లో కోట్లు చేతులు మారాయి. వీటి ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేసిన గుండాట, పేకాట యథేచ్ఛగా కొనసాగింది. బరుల చెంతనే మద్యం ఏరులై పారింది. ముందుగా అనుకున్న

ప్రాంతాల్లోనే కోడి పందాలు నిర్వహించిన పందెంరాయుళ్లు ఈసారి రాత్రికి రాత్రే కొత్త బరులను ఏర్పాటు చేసుకోవడం విశేషం. ఈ బరుల్లో కోడి పందేలను కొందరు ప్రజాప్రతినిధులు స్వయంగా పర్యవేక్షించడం గమనార్హం. పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు పందాలను వీక్షించారు. వందలాదిగా తరలివచ్చిన కార్లు, వేల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, జనంతో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. మినీస్టేడియం తరహాలో బరి చుట్టూ గ్యాలరీ ఏర్పాటు చేసుకుని మరీ పందాలను నిర్వహించారు. వీఐపీలు, వీవీఐపీలకు ప్రత్యేక గ్యాలరీలను కేటాయించారు. పలువురు మహిళలు సైతం ఇక్కడ పందేలను వీక్షించగా వారి కోసం ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. పందాలను వీక్షించేందుకు వచ్చిన ముఖ్యులకు ఆతిథ్యం ఇచ్చేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఇక కార్లు, ఇతర వాహనాల పార్కింగ్ కోసం ఖాళీ స్థలాలను సిద్ధం చేశారు. బరితో పాటు పార్కింగ్ స్థలాల్లో బందోబస్తు కోసం ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. ఇక తమిళనాడుతో జల్లికట్టు పోటీలు వైభవంగా మొదలయ్యాయి. మధురై కేంద్రంగా ఈ సంప్రదాయక్రీడ నిర్వహణకు అడ్డులేకుండా పోయింది. ప్రజాప్రతినధులే ఈ సంప్రదాయ క్రీడా పోటీలను ప్రారంభించగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన యువకులు ఉత్సాహంతో తిలకించారు. మొత్తంగా మూడురోజులు మజాగా గడిపారు.

# అమెరికా అధ్యక్ష రేసులో ఆసక్తి




### పోటీ నుంచి తప్పుకున్న వివేక్ రామస్వామి

### అమోవా నుంచే ట్రంప్‌కు లైన్ క్లీయర్

వాషింగ్టన్,జనవరి 16 (సమ సమాజం): అమెరికా అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి భారత సంతతి వ్యక్తి వివేక్ రామస్వామి వైదొలిగారు. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆయన మద్ధతు ప్రకటించారు. 2024 అమెరికా అధ్యక్ష ప్రాథమిక ఎన్నికల్లో భాగంగా అయోవా రాష్ట్రం నుంచి ప్రెసిడెన్షియల్ నామినేషన్ కోసం రిపబ్లికన్ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో పేలవ రీతిలో వెనుకబడడంతో రామస్వామి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 2023లో ఆయన అధ్యక్ష ఎన్నికల రేసులోకి దూసుకొచ్చి హాట్ టాపిక్‌గా మారారు. ఇమ్మిగ్రేషన్, 'అమెరికా ఫస్ట్' నినాదాలతో ఆయన ఆకర్షించారు. తన బలమైన అభిప్రాయాలతో మొదట్లో చాలామందిని ఆకట్టుకున్నారు. ప్రెసిడెన్షియల్ రేసులో రిపబ్లికన్ ఓటర్లలో దృష్టిని ఆకర్షించగలిగారు. అయితే రామస్వామి ప్రచార వ్యూహం, విధానాలు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నినాదాలకు దగ్గరగా ఉండడం మైనస్ అయ్యింది. దానికి తోడు రామస్వామిపై ట్రంప్ బహిరంగంగానే విరుచుకుపడుతూ వచ్చారు. ఒహియో స్థానికుడైన వివేక్ రామస్వామి కేరళ నుంచి అమెరికాకు వలస వెళ్లిన తల్లిదండ్రులకు జన్మించాడు. అధ్యక్ష ఎన్నికల రేసులో నిలిచి ప్రధాన పోటీదారుల్లో ఒకరిగా నిలిచిన విషయం తెలిసిందే.వివేక్ రామస్వామి దారుణంగా విఫలమైన అయోవా రాష్ట్రం రిపబ్లికన్ కాకస్‌లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘనవిజయం సాధించారు. దీంతో రిపబ్లికన్ ప్రెసిడెన్షియల్ నామినేషన్ ప్రక్రియలో ఆయన తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నారు. అయోవా ఓటింగ్‌ను బట్టి చూస్తే రామస్వామికి అంత సానుకూలత లేదని స్పష్టమవుతోంది. రామస్వామిని డొనాల్డ్ ట్రంప్ బహిరంగంగా వ్యతిరేకించారు. 'మోసం' అంటూ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయించారు. దీంతో భారతీయ-అమెరికన్ అయిన వివేక్ రామస్వామికి ఆదరణ తగ్గిపోయింది. అయోవాలో రామస్వామికి 7.7 శాతం ఓట్లు రావడంతో ఆయన నాలుగవ స్థానంలో నిలిచారు. ప్రైమరీలో కీలకమైన అయోవా కాకసన్ ఎన్నికల్లో ట్రంప్ మెజారిటీ ఓట్లు సాధించారు. ఐరాస మాజీ రాయబారి నిక్కీ హేలీ, ఎ÷-లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్‌లను వెనక్కి నెట్టి ట్రంప్ ముందు వరుసలో దూసుకుపోయారు. దీంతో రెండో స్థానం కోసం రాన్ డిశాంటిస్, నిక్కీ హేలీ మధ్య పోటీ నెలకొంది. ఇదే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడిన భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. దీంతో ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల బరిలో నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకునేందుకు కొన్ని నెలల పాటు ప్రైమరీ ఎన్నికలు జరగనున్నాయి. అయోవాలో రిగిన పోలింగ్.. రిపబ్లికన్ అభ్యర్థిని ఎన్నుకునే ప్రక్రియలో మొదటిది. అక్కడ ప్రస్తుతం విపరీతమైన మంచు కురుస్తున్నప్పటికీ ప్రజలు పెద్ద ఎత్తున ప్రజలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడం విశేషం. 1600 పోలింగ్ కేంద్రాల్లో జనం ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఇక ట్రంప్ అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడుతుండటం వరుసగా ఇది మూడోసారి. 2016లో ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2020లో డెమోక్రటిక్ నేత జో బైడెన్ చేతిలో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అధ్యక్ష పీఠం కోసం బరిలోకి దిగారు. అయితే, ఈ సారి ట్రంప్‌కు ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. ఇటీవలే ట్రంప్‌పై రెండు రాష్ట్రాలు వేటు కూడా వేశాయి. ప్రైమరీ ఎన్నికల్లో పోటీ చేయకుండా కొలరాడో, మైన్ రాష్ట్రాలు ఆయనను నిషేధించాయి. దీనిపై ఆయన అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి అనంతరం ఆయన మద్దతుదారులు నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జో బైడెన్‌ను అడ్డుకునేందుకు 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్‌పై దాడికి దిగిన విషయం విదితమే. వారిని సమర్థించి, హింసను ప్రేరేపించినట్టు ట్రంప్‌పై అభియోగాలున్నందున వచ్చే ఏడాది జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి ఆయన అనర్హుడని కొలరాడో సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ ఎమ్మెల్యే కోటా అభ్యర్థుల ఖరారు

### అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌లకు ఛాన్స్ ❑ సమాచారం ఇచ్చి, నామినేషన్లకు సిద్ధం కావాలన్న అధిష్టానం



హైదరాబాద్,జనవరి 16 (సమ సమాజం): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలకు కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేసింది. అద్దంకి దయాకర్, బల్మూరు వెంకట్ పేర్లను ఖరారు చేస్తూ వారికి సమాచారం ఇచ్చింది. వీటితో పాటు గవర్నర్ కోటాలో కూడా ఇద్దరి పేర్లను కరారు చేసినట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ భర్తీ చేయాల్సిన నాలాగు ఎమ్మెల్సీ సీట్లకు అభ్యర్థుల్ని ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటాలో అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్.. పేర్లను ఖరారు చేయగా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరామ్, అమిర్ అలీ ఖాన్ పేర్లను కాంగ్రెస్ ఫైనల్ చేసినట్లుగా తెలుస్తోంది. గురువారమే నామినేషన్లకు చివరి తేదీ ఉంది. ఎమ్మెల్యే కోటాలోని ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి గడువు ముగుస్తుంది. అనేక రకాల ఈక్వేషన్లు, అనేక రకాల వ్యక్తులను పరిగణలోకి తీసుకున్న తర్వాత అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ రెండు స్థానాలు పోటీ లేకుండా కాంగ్రెస్ ఖాతాలోనే పడే అవకాశాలు ఉన్నాయి. అదే విధంగా గవర్నర్ కోటాకు సంబంధించి కోదండరామ్, జావెద్ అలీ ఖాన్ కొడుకు అమిర్ అలీ ఖాన్ పేర్లను ఖరారు చేశారు. సియాసత్ పత్రిక సంపాదకుడు జాహెద్ అలీ ఖాన్ కుమారుడు అమిర్ అలీ ఖాన్. జాహెద్ అలీ ఖాన్‌కే చాన్స్ ఇవ్వాలనుకున్నా ఆయన రాజకీయ పదవులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ నలుగురి ఎంపిక చేశారు. అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తమ ఎమ్మెల్యే సీట్లను త్యాగం చేశారు. అసెంబ్లీ కోఆర్డినేటర్ గా ఉన్నప్పటికీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో బల్మూరి వెంకట్ హుజూరాబాద్ ఉప ఎన్నిక నుంచి పోటీ చేశారు. తక్కువ ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత పార్టీ ప్రయోజనాల దృష్ట్యా పోటీ నుంచి తప్పుకోవాలని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ ఇద్దరూ పోటీ నుంచి తప్పుకున్నారు. బల్మూరి వెంకట్ విద్యార్థి ఉద్యమం నుంచి ఉన్నారు. అనేక ఉద్యమాలు చేశారు. ఎన్ ఎస్ యూఐ తరపున అనేక విద్యార్థి ఉద్యమాలు నడిపించారు. టీఎస్ పీఎస్ సీలో పేపర్ లీక్, ఇతర అక్రమాలకు సంబంధించి గట్టిగా పోరాటం చేశారు. హైకోర్టును కూడా ఆశ్రయించారు. పార్టీ కోసం కష్టపడి పని చేశారు, జైలుకి కూడా వెళ్లారు.ఇక, అద్దంకి దయాకర్ పార్టీ వాయిస్ ను అనేక వేదికలపై బలంగా వినిపించారు.కోదండరామ్‌కు కాంగ్రెస్ హైకమాండ్ ముందుగానే హామీ ఇచ్చింది. ఆ ప్రకారం ఇప్పుడు ఆయనను ఎమ్మెల్సీ చేస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి కూడా ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనకు వెళ్లే ముందు రేవంత్ రెడ్డి మొత్తం జాబితాపై కసరత్తు చేసి వెళ్లారు. ఈనెల 29న ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. సంఖ్యాబలం పరంగా చూస్తే కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్సీ, బీఆర్ఎస్‌కు ఇంకో ఎమ్మెల్సీ వస్తుంది. కానీ, ఎన్నికలసంఘం ఈ రెండు స్థానాలకు వేర్వేరుగా నోటిఫికేషన్లు, వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకే రెండు ఎమ్మెల్సీ స్థానాలు దక్కనున్నాయి. ఒక అభ్యర్థికి కనీసం 59.5 ఓట్లు లభిస్తే ఆ అభ్యర్థిదే గెలుపు. అసెంబ్లీలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి 64 మంది సభ్యుల బలం ఉంది. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల ప్రకారం 2 స్థానాలకు వేర్వేరుగా 119 మంది సభ్యులు రెండుసార్లు ఓట్లు వేయాల్సి ఉంటుంది. అంటే మెజారిటీ ఉన్న కాంగ్రెస్ సభ్యులు రెండుసార్లు ఓటేస్తారు. అలా రెండు స్థానాలూ కాంగ్రెస్‌కే దక్కుతాయి. బీఆర్ఎస్ పోటీ పెట్టే అవకాశం లేదు. ఎమ్మెల్సీలుగా ఉన్న కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఎమ్మెల్సీలుగా వీరిద్దరికీ 30 నవంబర్ 2027 వరకు గడువు ఉన్నా.. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడంతో ఇద్దరూ గతనెల 9న తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు.

# నాసిన్ కేంద్రాన్ని ప్రారంభించిన మోడీ

### బెంగుళూరుకు సమీపంలోని అనంతలో ఏర్పాటు

### అయోద్యతో దేశం రామమయంగా మారిందని వ్యాఖ్య

### రాముడు సుపరిపాలనకు ప్రతీక అన్న మోడీ




అనంతపురం,జనవరి 16 (సమ సమాజం): నేషనల్ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్ అకాడమి (నాసిన్)ను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. శ్రీసత్యసాయి జిల్లాలోని గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలో 44వ జాతీయ రహదారికి ఆనుకుని 503 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ శిక్షణ కేంద్రాన్ని రూ.541 కోట్లతో నిర్మించారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం జగన్, పలువురు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. బెంగళూరు ఎయిర్ పోర్టు నుంచి ఈ అకాడమికి గంట సేపట్లో చేరుకునేంత దూరం ఉంటుంది. ఐఏఎస్‌లకు ముస్సోరి, ఐపీఎస్‌లకు హైదరాబాద్ లో శిక్షణ ఇచ్చే తరహాలోనే ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్)కు ఎంపికైన వారికి ఈ నాసిన్ లోనే ట్రైనింగ్ ఇస్తారు. నాసిన్ కోసం ప్రత్యేక రైల్వే లైన్ నిర్మాణానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి జరుగుతున్న సన్నాహకాల మధ్య, దేశమంతా ఇప్పుడు రామమయం అయిపోయిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మహాత్మా గాంధీ కూడా రామరాజ్యం గురించి మాట్లాడేవారని గుర్తు చేశారు. రామ్‌లల్లా దీక్షకు ముందు 11 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. రాముడి జీవిత పరిధి, అతని స్ఫూర్తి, విశ్వాసం భక్తి పరిధిని మించినవన్నారు. రాముడు సాంఘిక జీవితంలో సుపరిపాలనకు ఒక ప్రతీక అని, అతను యావత్ దేశానికి గొప్ప ప్రేరణగా మారగలడని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ సమయాన్ని వృథా చేయకుండా పనులు పూర్తి చేస్తారనే నమ్మకం ఉందని, ఖర్చు తక్కువగా ఉంటుందని భగవంతుడు భరత్‌తో చెప్పాడన్నారు. గత కొన్నేళ్లుగా, మా ప్రభుత్వం ఖర్చుపై దృష్టి పెట్టిందని తెలిపారు. రామరాజ్యం మన అందరికీ ఆదర్శప్రాయం అన్న మోదీ.. రామరాజ్యం సుపరిపాలన నాలుగు స్తంభాలపై నిలిచిందని తెలిపారు. ఈ నాలుగు స్థంభాలు ఏ మాత్రం నిర్భయంగా తలలు పట్టుకుని నడవగలవు, ఎక్కడ ప్రతి పౌరుడిని సమానంగా చూస్తావో, ఎక్కడ బలహీనులకు రక్షణ ఉంటుందో, అక్కడ మతం అంటే కర్తవ్యం ప్రధానం అన్నారు. అధర్మంగా వచ్చే పదవులు అక్కర్లేదు అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దేశంలో రామరాజ్యం నడుస్తోందని తెలిపారు. రాముడి మార్గంలో నడిస్తే దేశం భవిష్యత్తు బాగుటుందన్నారు. అలాగే అంతర్జాతీయ స్థానంలో భారత వాణిజ్యం విధానానికి మంచి పేరుందన్న మోదీ, ఈజ్ ఆఫ్ డూయింగ్‌కి నాసిన్ లాంటి సంస్థలతో చాలా ప్రయోజనం ఉంటుందన్నారు. మన అధికారులు కూడా రాముడిని ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. జీఎస్టీ రూపంలో దేశానికి కొత్త ఆధునికతను అందించామని ప్రధాని మోదీ అన్నారు. పన్నుల విధానంలో దేశంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. 7 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చామని, దీని వల్ల దాదాపు రూ.2.5 లక్షల కోట్ల పన్ను ఆదా అయిందన్నారు. నేడు, దేశంలోని పన్ను చెల్లింపుదారు తన పన్ను సక్రమంగా ఉపయోగపడుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పన్ను చెల్లిస్తున్నారన్నారు. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించే ప్రతీ పైసా సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. సుపరిపాలన అంటే ఇదేనన్నారు. 2014 వరకు రూ.2లక్షల వరకు పన్ను మినహాయింపు ఉందని, ఇప్పుడు ఆ మినహాయింపుని రూ.6లక్షలకు పెంచామన్నారు. దేశంలో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజల సంఖ్య పెరుగుతోందన్నారు. ఇదిలావుంటే, పాలసముద్రం సమీపంలో 503 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నాసిన్ శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. అత్యంత భద్రత నడుమ కొనసాగే విధంగా నిర్మాణం పూర్తి చేశారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి ఇక్కడి నుంచి గంటలో చేరుకునేంత దూరం ఉండటం కలిసొచ్చే అంశం. ఐఏఎస్, ఐపీఎస్‌లకు, ఐఆర్ఎస్‌లకు ఎంపికైనవారికి ఇక్కడ శిక్షణ ఇస్తారు. నాసిన్ పరిసరాల్లో పూర్తిగా సోలార్ సిస్టం కూడా ఇప్పటికే సిద్ధం చేశారు. శిక్షణలో భాగంగా అవసరమైన విమానాన్ని తీసుకొచ్చారు. అంతేకాదు నాసిన్ కోసం ప్రత్యేక రైల్వేలైన్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సత్యసాయి జిల్లాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా తొలుత భారీ భద్రత మధ్య ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి శ్రీ దుర్గా పాపనాశేశ్వర వీరభద్ర స్వామి ఆలయానికి మోదీ చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణ కుంభాల ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి స్వాగతం పలికారు. వీరభద్రేశ్వర స్వామికి ప్రధానమంత్రి మోడీ చేతుల మీదుగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతా అపహరణ ఘట్టాన్ని తోలుబొమ్మల ఆట ద్వారా ప్రదర్శించారు. తోలుబొమ్మలాటను వీక్షించిన నరేంద్ర మోడీ సీత రామస్వామి నామస్మరణ చేస్తూ కూర్చున్నాడు. ఆలయంలో గల వీరభద్ర స్వామి, దుర్గాదేవి, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, ఏకశిలా నంది విగ్రహం, వేలాడే స్తంభం, విరుపన్న రక్త చాయలు, అర్ధాంతంగా ఆగిన కళ్యాణ మండపం, సీత దేవి పాదం, నాట్య మండపంలో రాతి స్తంభాల పై చెక్కిన వివిధ రూపాల దేవతామూర్తుల శిల్పాలను ప్రధానమంత్రి మోడీ వీక్షించారు. భారతదేశంలో ఉన్న ప్రముఖ దేవాలయాల్లో లేపాక్షి దేవాలయం చాలా అద్భుతంగా ఉందని ఇక్కడ ఉన్న చిత్ర ,శిల్పాలు చూడడానికి చూడముచ్చటగా ఉన్నాయని ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కనపరస్తానని ప్రధానమంత్రి మోడీ పేర్కొన్నారు. ఆలయం వెలుపలికి వచ్చిన అనంతరం ప్రధానమంత్రి మోడీ ప్రజలకు అభివాదం తెలియజేస్తూ పెనుగొండ నియోజకవర్గం పాలసముద్రం గ్రామంలోని నాసిక్ అకాడమి ప్రారంభించేందుకు బయలుదేరారు.

# నగరంలో ట్రాఫిక్ చక్కదిద్దండి



పోలీస్ అధికారులకు డిజిపి సూచన

హైదరాబాద్, జనవరి 16 (సమ సమాజం): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ట్రాఫిక్ పరిస్థితిపై తెలంగాణ డీజీపీ రవిగుప్తా మంగళవారం సీనియర్ పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. విజిబుల్ పోలీసింగ్ ను అమలు చేయడం, ట్రాఫిక్ సిబ్బందికి ఆధునిక శిక్షణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్త స్కైవాక్ లు, ఫ్లై ఓవర్‌ల చుట్టూ ట్రాఫిక్ పరిస్థితులను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసు అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీనది ప్రాంతంలో వంతెనల పరిస్థితి, ప్రతిపాదిత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు, శిక్షణా కేంద్రం ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీలో పరిధిలో ట్రాఫిక్‌ను మరింత మెరుగుపరచాల్సిన అవసరముందని వెల్లడించారు. ప్రజల నుంచే వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇంటెలిజెన్స్ చీఫ్ బి శివధర్ రెడ్డి, అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, ఐజీ తరుణ్ జోషి పాల్గొన్నారు.

# 39 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

### ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసలుబాటు




విజయవాడ,జనవరి 16 (సమ సమాజం): సంక్రాంతి పండుగ వేళ ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడింది. హైకోర్టులో ఉద్యోగాల భర్తికి ఏపీ సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసింది. స్టేట్ జ్యుడీషియల్ సర్వీసెస్‌లో భాగంగా జూనియర్ డివిజన్ బెంచ్‌కు సంబంధించిన 39 సివిల్ జడ్జి పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జనవరి 31 నుంచి ఆ÷-లన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఇందులో 32 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్మెంట్ ప్రాతిపదికన భర్తీ చేయగా.. మిగిలిన 7 పోస్టులను ట్రాన్స్‌ఫర్ పద్దతిలో నియామకాలు జరుగుతాయి. ఇక అర్హతల విషయానికొస్తే.. లా విద్యలో డిగ్రీ పట్టా పొంది ఉండాలి. వయసు 35 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్ క్యాటగిరీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల మినహాయింపు ఉంటుంది. అలాగే దివ్యాంగులకు వయోపరిమితిలో పదేళ్ల మినహాయింపు ఉంటుంది. అప్లికేషన్ పూర్తిగా ఆన్‌లైన్లో మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది. జనరల్ క్యాటగిరీ అభ్యర్థులు దరఖాస్తుకు రూ. 1500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదే రిజర్వేషన్ క్యాటగిరీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు రూ. 750 చెల్లించాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుకు గడువు జనవరి 31 నుంచి మార్చి 1 వరకూ ఉంటుంది. ఈ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి ఎంపిక ప్రక్రియ స్క్రీనింగ్ టెస్ట్, రాత పరీక్ష, వైవా, వాయిస్ టెస్ట్ ఇలా వివిధ దశల్లో నిర్వహిస్తారు. వీటన్నింటిలో మంచి ప్రతిభ కనబరిచిన వారితో తుది జాబితాను విడుదల చేసి నియమిస్తారు. కంప్యూటర్ ఆధారిత స్క్రీనింగ్ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి మూడు పేపర్ల రాత పరీక్ష ఉంటుంది. ప్రతి పేపర్‌కు వంద మార్కులు చొప్పున ప్రశ్నా పత్రం రూపొందిస్తారు. ఒక్కొక్క పేపర్ రాయడానికి 3 గంటల సమయం ఉంటుంది. పరీక్ష కేంద్రాలు గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖలో ఉంటాయి.ఈ పరీక్షలకు సంబంధించిన అభ్యంతరాలను ఏప్రిల్ 18 న స్వీకరిస్తారు.

# నార్సింగ్‌లో దారుణం

### వాచ్‌మెన్‌ను హత్య చేసిన మేస్త్రీ

రంగారెడ్డి,జనవరి 16 (సమ సమాజం): నార్సింగీలో దారుణం జరిగింది. మంచిరేవులలో జంగయ్య అనే వాచ్ మన్ దారుణ హత్యకు గురయ్యాడు. ఇద్దరు మధ్య వివాదం చెలరేగింది. చినికి చినికి గాలి వానగా మారి జంగయ్యను మేస్త్రి అర్జున్ హత్య చేశాడు. సమాచారం అందుకున్న నార్సింగీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి.. హంతకుడికి కోసం దర్యాప్తు చేపట్టారు.నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో స్క్రాప్ అమ్ముకుంటున్నాడనే కోపంతో జంగయ్యపై మేస్త్రి అర్జున్ దాడి చేశాడు. ఈ దాడిలో వాచ్ మెన్ జంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన మేస్త్రి అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పూర్తి సమాచారం అందవలసి ఉంది.

# కిటకిటలాడిన మాంసం విక్రయ కేంద్రాలు

### భారీగా పెరిగిన మాంసం ధరలు

విజయనగరం,జనవరి 16 (సమ సమాజం): సంక్రాంతి పండుగ నేపద్యంలో మాంసం ధరలకు రెక్కలు వచ్చాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా, పేద ధనిక అనే తారతమ్యం లేకుండా చాలా మంది ఇళ్ళల్లో మంగళవారం మాంసం వంటలు వండుకొని తింటారు. ఈ నేపద్యంలో ఇదే అదునుగా భావించిన వ్యాపారులు ఒక్కసారిగా మాంసం ధరలను అమాంతంగా పెంచేశారు. మటన్ కేజీ 800 నుంచి 900 కి, చికెన్ 160 నుంచి 200, 240కి పెరిగిపోయాయి. చేపలు 120 నుంచి 150 కి, నాటు కోడి మాంసంకి మరింత గిరాకీ పెరిగిపోయింది. కేజీ మాంసం 700 నుంచి 1000 కి చేరిపోయింది. దీంతో కొనుగోలు దారుల బెంబేలెత్తి పోతున్నారు. ధరలు పెరిగిన తప్పదు కాబట్టి ఇదే అదునుగా వ్యాపారులు జేబులు నింపుకుంటున్నారు. ధరలు పెరిగినప్పటికీ పండగ కావడంతో ఉదయం 5 గంటల నుంచి చికెన్, మటన్, చేపలు మార్కెట్లు జనంతో నిండిపోయాయి. గంటల కొద్దీ ఉంటే తప్ప కేజీ మాంసం దోరకని పరిస్థితి అనేక ప్రాంతాల్లో నెలకొంది.

# ఆర్టీసికి కలసి వచ్చిన సంక్రాంతి రద్దీ




(మొదటి పేజీ తరువాయి) లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. దీంతో ఆర్టీసీకి ఆ ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ. 12 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మరో వైపు మహిళలకు జారీ చేసే జీరో టికెట్లు 9 కోట్లు దాటినట్లు తెలిపారు. ఈ నెల 11న 28 లక్షల మంది, 12న 28 లక్షల మంది, 13న 31 లక్షల మంది ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు. పండుగ సమయంలో ప్రయాణించే మహిళల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంటుందని ముందే గ్రహించిన ఆర్టీసీ.. అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేసింది. ముందుగా 4,484 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని భావించింది. కానీ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఈ నెల 11, 12, 13 తేదీల్లోనే 4,400 ప్రత్యేక బస్సులను నడిపినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తంగా 6,261 ప్రత్యేక బస్సులను నడిపినట్లు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రయాణికుల్ని వారి గమ్యస్థానాలకు చేర్చినట్లు అధికారులు స్పష్టం చేశారు. నష్టాలతో నడుస్తున్న ఆర్టీసీకి సంక్రాంతి పండుగ సీజన్ లాభాలను తెచ్చిపెట్టింది. ఉన్నత చదువులు, ఉద్యోగాల రీత్యా హైదరాబాద్ స్థిరపడిన పలువురు పండుగ సందర్భంగా తమ స్వస్థలాలకు తరలి రావడంతో ఆదాయం భారీగా సమకూరిందని సమాచారం. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో కళాశాలల్లో చదువుకునే యువతీ యువకులు కూడా తమ సొంత గ్రామాలకు తరలిచ్చారు. ఉద్యోగాలు చేసే వారు కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చేరుకున్నారు. ముందస్తు రిజర్వేషన్ చేసుకుని ఆర్టీసీలో ప్రయాణించారు. అయినా సీట్లు దక్కని చాలా మంది ప్రైవేట్ ట్రావెల్స్ ఆశ్రయించారు. ఇదే అదనుగా భావించి రోజూ వారీ ఛార్జీల కంటే ప్రైవేట్ వాహనాల యాజమాన్యాలు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయడంతో వారికి కూడా బాగా కలసి వచ్చింది. సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల నుంచి రెగ్యులర్ నడిపే బస్సులతో పాటు అదనపు సర్వీసులను నడిపారు. రెగ్యులర్ నడిచే బస్సులతో పాటు అదనంగా ఏర్పాటు చేసిన బస్సులతో సౌకర్యం కల్పించారు. దీంతో ఆర్టీసీకి సంక్రాంతి పండుగ రోజుల్లో భారీగా ఆదాయం సమకూరింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆరు డిపోల నుంచి హైదరాబాద్ నుంచి ప్రతి రోజూ నడిచే బస్సులతో పాటు అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగ ముగిసిన అనంతరం 16తేదీ మంగళవారం నుంచి 20తేదీ వరకు ప్రయాణికు లను హైదరాబాద్ చేరవేసేందుకు కూడా అదనపు సర్వీసులను నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాలకు బస్సులు నడుస్తాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అప్పటికప్పుడు అదనపు బస్సులు నడిపారు. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ జిల్లాలకు వెళ్లేందుకు కూడా ప్రత్యేక బస్సులు వేశారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించారు. ఆర్టీసీ బస్ స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడు తుండడంతో సంక్రాంతి పండుగ రోజుల్లో అధికంగా ఆదాయం సమకూరిందని సమాచారం. సంక్రాంతి పండుగ సీజన్ దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు ఛార్జీలను అమాంతం పెంచారు. ఆర్టీసీ సంస్థకు వస్తున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులకు ఛార్జీలు పెంచకుండా ఆదాయాన్ని రాబట్టుకున్నారు. ప్రైవేట్ సంస్థలకు భారీగా ఆదాయం సమకూర్చింది.

# శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు



(మొదటి పేజీ తరువాయి) హరిదాసుల సంకీర్తనలతో సందడి సందడిగా మారింది. సోమ,మంగళవారాల్లో శిల్పారామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శిల్పారామం లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాత్రి వరకు గంగిరెద్దు విన్యాసాలు హైలెట్‌గా నిలిచాయి., ఓ పక్క నగర వాసులు పల్లెటూర్లకు బయల్దేరి వెళ్లారు. దీంతో నగరంలో ఉన్న ప్రలకు శిల్పారామం సంక్రాంతి సంబరాలను చేరువ చేసింది. నగరంలో ఉండే తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాన్ని కాపాడేందుకు శిల్పారామం సొసైటీ వారు పల్లెవాతావరణం తలపించేలా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రకృతి పర్యావరణ, సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన శిల్పారామంలో ఉదయం 11గంటల నుంచి గంగిరెద్దుల నృత్యాలు, హరిదాసుల సంకీర్తనలు, బుడగ దేవర నృత్యాలు, బుడబుక్కల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మెదక్, రంగారెడ్డి జిల్లాల కళాకారులు గంగిరెద్దులతో పలు విన్యాసాలు చేయించి సందర్శకులను ఆకట్టుకుంటున్నారు. సంక్రాంతి ముగ్గులు అందరి మనస్సులు దోచుకున్నాయి. భారీగా పిల్లా పాపలతో తరలిచ్చిన ప్రజలు ఎంజాయ్ చేశారు. నగరం నలుమూలల నుంచి వచ్చే సందర్శకులతో శిల్పారామం కిటకిటలాడింది. శనివారం భోగి, ఆదివారం సంక్రాంతి సందర్భంగా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో సైబర్‌టవర్ నుంచి హైటెక్స్ కమాన్ వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కు చేశారు. దీంతో శిల్పారామంలో ఎక్కడికక్కడే వాహనాలు రోడ్లపై నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు. హైటెక్ సిటీలోని శిల్పారామానికి జనాలు క్యూ కట్టారు. శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ప్రజలు భారీగా తరలివచ్చారు. పల్లె వాతావరణంతో అక్కడ సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గంగిరెద్దులు విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. పండగ ప్రత్యేకతలు పిల్లలకు తెలిసేలా కార్యక్రమాలు రూపొందించారు. వీటిని చూసేందుకు జనం భారీగా తరలివస్తున్నారు. దీంతో శిల్పారామానికి వచ్చే రహదారులన్నీ ట్రాఫిక్ జామ్ అయ్యాయి. శిల్పారామానికి వచ్చి వెళ్లే రూట్లలో కిలో మీటరు కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో జనాలు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలతోపాటు హైదరాబాద్ నగరంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా కొనసాగాయి. సంక్రాంతి సంబురాల్లో భాగంగా శిల్పారామంలో గంగిరెద్దుల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కూచిపూడి, భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు, హరిదాస్ కీర్తనలతో నగరంలోని శిల్పారామం మార్మోగిపోయింది. సంక్రాంతి వేడుకల్లో పాల్గొని.. సాంస్కృతిక కార్యక్రమాలు చూసేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో శిల్పారామానికి తరలివచ్చారు. వినీలాకాశంలో రివ్వున ఎగిరే పతంగులు గల్లీల్లోనూ ఎగిరాయి.

# దావోస్‌లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం




(మొదటి పేజీ తరువాయి) ఉన్నారు. పారిశ్రామిక పెట్టుబడులే లక్ష్యంగా ఆయన పర్యటన కొనసాగుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రెసిడెంట్ బ్రెండి బోర్గ్, ఇథియోపియా డిప్యూటీ పీఎం మేకొనెన్‌తో రేవంత్ భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం, నైపుణ్యం పెంచే అంశాలపై మాట్లాడారు. దావోస్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డితో ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సహ ప్రత్యేక కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి, సీఎంవో ఉన్నతాధికారులు శేషాద్రి, అజిత్ రెడ్డి ఉన్నారు. వివిధ దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు, సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి బృందం చర్చించి, ఒప్పందాలపై సంతకాలు చేయనుంది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, డిఫెన్స్, ఏరోస్పేస్, ఆహార శుద్ధి, పునరుత్పాదక ఇంధ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరుతుంది. నొవర్తిస్, మెడ్ ట్రానిక్స్, ఆస్ట్రాజెనిక్, గూగుల్, ఉబెర్, మాస్టర్ కార్డ్, బేయర్, ఎల్డీసీ, యూపీఎల్ కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కలుస్తారు. మన దేశానికి చెందిన టాటా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్, జేఎస్‌డబ్ల్యూ, గోద్రెజ్, ఎయిర్ టెల్, బజాజ్, సీఐఐ; నాస్కం వ్యాపార ప్రతినిధులతో ఈ రోజు, రేపు సీఎం రేవంత్ రెడ్డి చర్చిస్తారు. వైద్యారోగ్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ప్రజల హెల్త్ డేటా రూపొందించే అంశంపై చర్చ జరగనుంది. ఈ చర్చా గోష్టిలో సీఎం రేవంత్ రెడ్డితోపాటు యురోపియన్ కమిషన్ ఆరోగ్య ఆహార కమిషనర్, జెనీవా వరల్డ్ ఎకనామిక్ ఫోరం సెంటర్ ఫర్ హెల్త్ అధినేత, ఆక్సియోస్ చీఫ్ ఎడిటర్, రువాండ ఐటీ మంత్రి, మయో క్లినిక్ సీఈవో, టకేడా ఫార్మా కంపెనీ సీఈవో పాల్గొంటారు.

# ఊరించనున్న నిర్మల మధ్యంతర బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి) పథకాలను ప్రస్తావించే అవకాశం ఉంది. ప్రధానంగా రైతులు, మహిళలను ఆకట్టుకునే పథకాలను ప్రకటించవచ్చు. లోక్‌సభలో మళ్లీ భారీ మెజార్టీతో గెలవాలని మోడీ ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం మోడీ ప్రభుత్వం రంగంలోకి దిగబోతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, మధ్యంతర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అనేక పెద్ద ప్రకటనలు చేసే అవకాశం ఉంది. మోడీ హయాంలో బ్జడెట్ 2.0 ప్రతి తరగతి నుండి అధిక అంచనాలను కలిగి ఉంది. రైతులు, యువత, మహిళలకు ఈ బ్జడెట్ ప్రత్యేకం. లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాడ్లీ బహనా, లడ్కీ బహిన్ పథకాన్ని అమలు చేయవచ్చని మీడియా కథనాలు చెబుతున్నాయి. నివేదికల ప్రకారం, అర్హత, ప్రమాణాలు, వార్షిక ఆదాయం, దాని ప్రయోజనాలపై చర్చ ప్రారంభమైంది. ఈ పథకం దేశంలోని మహిళల కోసం ప్రత్యేకంగా ఉంటుంది. ఈ పథకం మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించింది. లాడ్లీ బహనా పథకం బీజేపీకి భారీ ఆధిక్యాన్ని ఇచ్చింది. ఈ బడ్జెట్ ఈసారి మహిళలకు భారీగా నిధులు సమకూర్చే అవకాశం ఉంది. మధ్యంతర బడ్జెట్‌లో ప్రభుత్వ మహిళలు నేరుగా నిధుల డిపాజిట్, నైపుణ్యాభివృద్ధి పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చు. మహిళా రైతులు ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద సంవత్సరానికి రూ. ఎదుర్కొంటున్నారు. ఇక షర్మిళ నేరుగా ఏపీ రాజకీయ రంగంలోకి దూకారు కాబట్టి నేరుగా జగన్ను విమర్శించే పరిస్థితి వస్తుంది. ఎవరికీ మద్దతు ఇవ్వకుండా విజయమ్మ తటస్థంగా ఉంటారని వైసీపీ వర్గాలు నమ్ముతున్నాయి. కానీ ప్రస్తుతం విజయమ్మ షర్మిల వద్దే ఉంటున్నారు. రెండు, మూడు సార్లు షర్మిలతో కనిపిస్తే.. కుమార్తెకే ఆమె మద్దతు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ఇది సీఎం జగన్‌కు ఇబ్బందే. ఇకపోతే ఎన్నికల బరిలో దిగడంతో ఎపి రాజకీయాల్లో కొంత మార్పు రానుంది. ఇప్పటికే టిడిపి, జనసేన కలసి పోరాడుతున్నాయి. జనసేన మాతోనే ఉందని బిజెపి అంటోంది. షర్మిల ఒంటరిగా బరిలోకి దిగనుంది.

# పుట్టపర్తి చేరుకున్న ప్రధాని మోడీ



(మొదటి పేజీ తరువాయి) సందర్భంగా లేపాక్షి ఆలయ విశిష్టతను అర్చకులు ప్రధాని మోదీకి వివరించారు. ఆలయం ప్రాంగణంలో సీతారాముల విశేషాలను తెలిపేలా తోలుబొమ్మలాటల రూపంలో రామాయణంను ప్రదర్శించారు. లేపాక్షి సందర్శన అనంతరం గోరంట్ల మండలం పాలసముద్రం దగ్గర కొత్తగా నిర్మించిన నాసిన్ కేంద్రం లో నిర్మించిన క్యాంపస్ భవనాలను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో జిల్లాలో మొత్తం ఆరు హెలిప్యాడ్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఐదు వేల మందితో బందోబస్తు నిర్వహిస్తు న్నారు.

# ఎపి పిసిసి చీఫ్‌గా వైఎస్ షర్మిల




(మొదటి పేజీ తరువాయి) విలీనం చేశార. 2, 3 నెలల్లో ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే బాధ్యతలను షర్మిలకు హైకమాండ్ అప్పగించింది. తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేసి పాదయాత్ర చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో పాలేరు నుంచి బరిలోకి దిగాలని అనుకున్నారు. వివిధ కారణాలతో అక్కడి నుంచి పోటీ చేయడం వీలు పడలేదు. కాంగ్రెస్ పెద్దలను కలువగా ఏపీ కాంగ్రెస్ బాధ్యతల గురించి అప్పడే చెప్పారని ఊహాగానాలు వచ్చాయి. షర్మిల తన పార్టీని విలీనం చేయడంలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలకపాత్ర పోషించారు. ఏపీలో ఒక్క అసెంబ్లీ, పార్లమెంట్ సీటు కాంగ్రెస్ పార్టీకి లేదు. రాష్ట్ర విభజన తర్వాత ఆ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ కరవైంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల రెడ్డిని నియమించడం ద్వారా లబ్ది పొందాలని చూస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొనారు. ఏపీ పీసీసీ చీఫ్ గా ఉన్న గిడుగు రుద్రరాజు సోమవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను మల్లికార్జున ఖర్గేకు అందజేశారు. అయితే, గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమిస్తూ కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. గిడుగు రుద్రరాజు ఏపీ అధ్యక్షుడిగా అందించిన సేవలను అభినందిస్తూ పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోండి



(మొదటి పేజీ తరువాయి) అభివృద్ధి చెందిందని తెలిపారు. ఎంతో నైపుణ్యం కలిగిన పవర్లూమ్ నేతన్నలు, అభివృద్ధి చెందడమే కాకుండా తమ కార్యకలాపాలను విస్తరించారన్నారు. గత పది సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సహకారమే ఇందుకు ప్రధాన కారణమని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పవర్లూమ్ వస్త్ర పరిశ్రమకు అండగా నిలవాలన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఈ పరిశ్రమ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సహకారం ఉంటే తమిళనాడులో ఉన్న తిరుపూర్ వస్త్ర పరిశ్రమతో సమానంగా పోటీ పడగలిగే అవకాశాలు ఈ రంగానికి ఉన్నాయన్నారు. అయితే ఈ రంగానికి సంబంధించి గత 15 రోజులుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే ఈ పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలోకి వెళుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు.

# మోడీ రాజకీయ కార్యక్రమంగా అయోధ్య



(మొదటి పేజీ తరువాయి) బీజేపీ-ఆర్ఎస్ఎస్ కలిసి చేస్తున్న ఫంక్షన్‌కు తాము అందుకే వెళ్లడం లేదన్నారు రాహుల్. తమకు అన్ని మతాలు సమానమేనని స్పష్టం చేశారు. హిందూ మతపెద్దలు కూడా ఈ కార్యక్రమానికి వెళ్లడం లేదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అయోధ్యలో జరగనున్న ఈ కార్యక్రమాన్ని పూర్తిగా ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ కార్యక్రమంగా మార్చారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్‌లోని కోహిమాలో విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రామ మందిర ప్రారంభోత్సవానికి సంబంధించిన కార్యక్రమానికి సంబంధించి హిందూ మతానికి చెందిన ముఖ్యమైన వ్యక్తులు కూడా ప్రశ్నలు లేవనెత్తారని అన్నారు. ఈ కార్యక్రమం ఎన్నికలకు సంబంధించినదిగా మారింది. అటువంటి పరిస్థితిలో, కాంగ్రెస్ అధ్యక్షుడు వెళ్ళకూడదని నిర్ణయించు కున్నారు. మేము అన్ని మతాలను గౌరవిస్తాము. అయితే మా పార్టీ, కూటమి నుంచి వెళ్లాలనుకునే వారు అక్కడికి వెళ్లవచ్చు అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ అయోధ్యకు వెళ్లబోనని సైగల ద్వారా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం అయోధ్య న్యాయ యాత్ర మార్గంలో లేదు. బీజేపీని ఎదుర్కోవడానికి భారత కూటమి పూర్తిగా సిద్ధంగా ఉందని రాహుల్ గాంధీ ప్రకటించారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర అనేది భావజాల ప్రయాణం. భారత కూటమి ఎన్నికల్లో బాగా పోరాడి విజయం సాధిస్తుందన్నారు. న్యాయ యాత్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం, కుల గణన వంటి అనేక సమస్యలను పరిష్కార మార్గంగా ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భారత కూటమి పొత్తుపై స్పందించిన రాహుల్.. 'మేము బెంగాల్‌లోని మా మిత్రపక్షాలతో చర్చిస్తున్నాము, ప్రస్తుతం సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్నాయి. ఇందులో ఎటువంటి చిక్కు లేదు. అయితే, కొన్ని రాష్ట్రాల్లో సమస్య ఉందని ఆయన అంగీకరించారు. హింస జరిగిన తర్వాత కూడా ప్రధాని మోదీ ఈశాన్య ప్రాంతంలోని మణిపూర్‌కు వెళ్ళకపోవడంపై రాహుల్ తప్పుబట్టారు. నాగాలాండ్‌కు ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదన్నారు. ఇదిలావుంటే, అయోధ్య రామాలయం ప్రారంభమయ్యే జనవవరి 22వ తేదీన రాహుల్ జోడో యాత్ర అసోం చేరుకుంటుంది. గౌహతి లోని శివాలయంలో రాహుల్ ఆ రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. మరోవైపు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి బీజేపీని ఓడిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మిత్రపక్షాలతో సీట్ల పంపకాల చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయన్నారు. కూటమిలోని చిన్న చిన్న సమస్యలు పరిష్కారమవుతాయని, తాము కలసికట్టుగా విజయం సాధిస్తామని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం పోరాడేందుకే ఈ యాత్ర చేపట్టినట్లు వెల్లడించారు. జనవరి 14న మణిపూర్‌లోని తౌబాల్‌లో ప్రారంభమైన యాత్ర సోమవారం సాయంత్రం నాగాలాండ్‌కు చేరుకుంది. అయోధ్యలో జనవరి 22న రామ మందిర ప్రతిష్ఠాపన జరగనుంది. వేడుకకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని పలువురు సినీ రాజకీయ ప్రముఖులకు ఆహ్వానాలు అందాయి.

# పశుసంవర్ధక శాఖ ఫైళ్లు మాయం



(మొదటి పేజీ తరువాయి) నిర్ణయం తీసుకుంది. గొర్రెల పంపిణీ నగదు బదిలీల్లో ఉన్నతాధికారుల ప్రమేయం ఉందని తేలింది. దీంతో గచ్చిబౌలిలోని అధికారులపై కేసు నమోదైంది. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైల్స్ మాయంపై కూడా కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా వాటని ఏసీబీకి బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పాటు కాగానే పలుచోట్ల ఫైళ్లు మాయం దగ్ధం కావడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ మాసబ్ ట్యాంక్ లోని పశు సంవర్ధక శాఖ ఆఫీసులోకి అక్రమంగా ప్రవేశించి, సిబ్బంది సహాయంతో బీరువాలో ఉన్న ÷ళ్లైను చింపివేసి, కొన్ని ముఖ్యమైన ÷ల్స్?ను తన కారులో తీసుకెళ్లాడు. ఈమేరకు వాచ్‌మెన్ మందాల లక్ష్మయ్య ఫిర్యాదుతో పోలీసులు కల్యాణ్, ఆపరేటర్ మోహన్ ఎలిజ, వెంకటేశ్, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేశారు. ఇక గొర్రెల పంపిణీ వ్యవహారంలో కూడా కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ పథకంలో బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున నిధులను మళ్లించినట్లుగా గుర్తించింది. దీంతో పలువురు అధికారులపై కేసులు నమోదు కాగా తాజాగా ఈ కేసులను ఏసీబీక బదిలీ చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

# సంక్రాంతి సంబరాలు



**చందూరు, జనవరి 16 (సమ సమాజం):** తుమ్మలపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా జరిగాయి. గ్రామ యువజన నాయకులు ముందుగా అనుకున్న ప్రకారం ఒక సోషల్ మీడియా గూపును క్రియేట్ చేసుకొని గ్రామంలో ఉన్న యువతను, ఉపాధి కొరకై పట్టణాలలో ఉంటున్నా యువతను, ఉన్నత విద్యను అభ్యసించే వివిధ ప్రాంతాల్లో ఉంటున్న యువతను ఆ గృపులో యాడ్ చేసుకొని అందరిని వీలు చూసుకుని రెండు రోజుల ముందే గ్రామానికి వచ్చే విధంగా ప్లాన్ చేసుకున్నారు, యువత అంత కలిసి కుల మతాలకు అతీతంగా క్రీడలు ఆడాలని గ్రామంలో ఖాళీగా ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ భూమిలో గ్రామ పంచాయతీ అధికారి సహకారంతో డోజర్‌తో గ్రౌండ్ తయారు చేసుకున్నారు. క్రీడలు ఆడి ఆనందం వ్యక్తం చేశారు. ఈ క్రీడలో గెలుపొందిన వారికి కురుపాటి సుదర్శన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. తుమ్మలపల్లి గ్రామానికి పెద్ద పండుగ అంటే శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మాత్రమే ఉండేది ఇప్పుడు యువత ఎదిగిన తర్వాత ప్రతి పండుగను పండుగలా జరుపుకోవాలి కోరుకున్నారు. జాతరకు తప్ప ఎప్పుడూ కలవని యువత ఇలా కలవడం, కలిసి ఆడుకోవడం, పండుగను గొప్పగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది అని అన్నారు

# ఇడి విచారణకు రాలేనన్న కవిత



(మొదటి పేజీ తరువాయి) సీఎం అరవింద్ కేజ్రీవాల్ కు సైతం ఈ కేసులో ఈడీ నాలుగోసారి నోటీసులు జారీ చేసింది. జనవరి 18న విచారణకు హాజరు కావాలని నోటీసులలో పేర్కొంది. గత మార్చి నెలలో ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత ఈడీ విచారణకు పలుసార్లు హాజరైంది. ఈడీ ఆఫీసులో మహిళల విచారణ సీఆర్పీసీకి విరుద్ధం అంటూ అప్పటి నుంచి కవిత చెబుతూ వస్తున్నారు. దీనిపై అప్పుడే ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నళిని చిదంబరం తరహాలో ఇంటి వద్దే ఈడీ తనను విచారణ చేయాలని కవిత కోరుతున్నారు. ఈ క్రమంలో ఈడీ లాంటి దర్యాప్తు సంస్థల తీరును తప్పుబడుతూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇటీవల మళ్లీ ఈడీ ఆఫీసులో విచారణకు రావాలని నోటీసులు జారీ అవడంతో ఆమె సుప్రీంను ఆశ్రయించారు. ఆప్, వైసీపీ నేతలతో పాటు కవిత ఈ కేసులో విచారణను ఎదుర్కొన్నారు.

## అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో బెదిరించి డబ్బులు గుంజుకున్న నలుగురు వ్యక్తుల అరెస్టు, రిమాండు కు తరలింపు

ఎ.మన్‌మోహన్ యాదవ్ ఇన్స్పెక్టర్, అబ్దుల్లాపూర్‌మెట్



**అబ్దుల్లాపూర్ మెట్, జనవరి 16 (సమ సమాజం):** అబ్దుల్లాపూర్ మెట్ పోలీసు స్టేషన్ పరిధిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగింది అని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎ. మోహన్ తెలిపినారు. సదరు వ్యక్తుల పేర్లు ఏ1గా ఏలేటి దుర్గా ప్రసాద్ తండ్రి చంద్ర మౌలీ, ఏ2 సిరిగిరి మధు తండ్రి క్రీ.శ వెంకటేశ్, ఏ3 గగనం రవీందర్ ఏ4 మోతే శ్రీనువాసు. వీరి నివాసం కళానగర్, హయత్‌నగర్ వాసులుగా గుర్తించారు. వీళ్ళు తేధీ గత శనివారం రాత్రి సుమారుగా 11:00 గంటల సమయంలో శ్రీ. స్వవాల్ రామ్ తండ్రి బాలు రామ్, గ్రామం పెద్ద అంబర్ పేట్ వాసి. తన షాప్ బంద్ చేసి ఇంటికి వెళ్తుండగా ఏ కాన్వెన్షన్ దగ్గర రెండు బైక్‌ల పై వెళ్ళి అడ్డగించి అతనిని బెదిరించి అతని వద్ద వున్న నగదు ఎనిమిది వేల రూపాయలను గుంజుకొని అక్కడి నుండి పారిపోయారు. మంగళవారం వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వీరిని అరెస్టు చేసి రిమాండు నిమిత్తము గౌరవ హయత్ నగర్ కోర్టులో హాజరుపరిచారు.

## విరాట్ కోహ్లీకి అయోధ్య ట్రస్ట్ ఆహ్వానం



ముంబై, జనవరి 16 (సమ సమాజం): అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం దగ్గరవుతున్న కొద్దీ సెలబ్రెటీలకు వరుస ఆహ్వానాలు అందుతున్నాయి. ఇండియన్ క్రికెట్ ఐకాన్ విరాట్ కోహ్లీకి తాజాగా అయోధ్య నుంచి ఆహ్వానం వచ్చింది. ఈనెల 22న జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా విరాట్ కోహ్లీ, అనుష్క శర్మకు రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆహ్వాన పత్రిక అందజేసింది. దేశవ్యాప్తంగా 1100 మంది అతిథులు అయోధ్య ఈవెంట్‌లో పాల్గొంటున్నారు. మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోనికి ఇటీవల అయోధ్య నుంచి ఆహ్వానాలు అందాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 22న జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గోనున్నారు. శ్రీరామజన్మభూమి కాంప్లెక్స్‌లోని కుబేర్ నవరత్న తిలను దర్శించడంతో పాటు, జటాయువు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించనున్నారు.

# భార్యను చంపిన కిరాతక భర్త

**రంగారెడ్డి, జనవరి 16 (సమ సమాజం):** అనుమానం పెనుభూత మైంది. జీవితాంతం తోడుంటానని అగ్ని సాక్షిగా వివాహామాడిన భర్తే ఆమె పాలిట యముడయ్యాడు. భార్య తల నరికి అత్యంత కిరాతకం గా హతమార్చాడు. ఈ విషాదకర సంఘటన జిల్లాలోని అబ్దుల్లాపూర్ మెట్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వినయ్ అనే వ్యక్తి తన భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో తలను నరికి చంపాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కెసిఆర్ సిఎం కాకపోవడంపై ప్రజలు జీర్ణించుకోవడం లేదు

♦పదవులు వస్తాయి..పోతాయి
♦ఎంతమంచిగా పనిచేశామన్నదే ముఖ్యం
♦సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్



సిరిసిల్ల, జనవరి 16 (సమ సమాజం): పదవులు వస్తాయి, పోతాయి, పదవిలో ఉన్నప్పుడు ఎంత మంచిగా పనిచేశారన్నదే ముఖ్యమంటూ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. 2014 నుంచి మన రాష్ట్రానికి 82 అవార్డులు వచ్చాయనీ.. అవార్డులు వచ్చినందుకు గర్వపడుతున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. పదవిలో ఉన్నప్పుడు అన్ని విధాలా మంచిగా పనిచేశారు కాబట్టే, ప్రజలు కెసిఆర్ ముఖ్యమంత్రి కాలేదన్నది జీర్ణించుకోలేక పోతున్నారంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించిన కేటీఆర్.. స్థానిక బీఆర్ ఎస్ నేతలు,కార్యకర్తలను కలిశారు. సిరిసిల్లలో నిర్వహించిన సర్పంచ్‌ల ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో కీలకమన్నారు. సర్పంచ్ లు చాలా కష్టపడి పని చేసి ఓడిఎఫ్ ప్లస్ గా రాష్ట్రంగా మార్చినందుకు సలాం చేస్తున్నానన్నారు. పెండింగ్ బిల్లుల సమస్యపై సర్పంచ్‌ల తరుపున ప్రభుత్వంతో మాట్లాడడానికి తాము సిద్దంగా ఉన్నామని అన్నారు. పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. గత ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తూనే కాంగ్రెస్ సర్కార్ మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ దళం.. తెలంగాణ గళం.. బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజల పక్షమేనన్నారు కేటీఆర్. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులను సహించే ప్రసక్తే లేదన్నారు. ఇటీవల నాగర్ కర్నూల్ జిల్లా గంట్రావుపల్లిలో మాజీ జవాన్, బీఆర్ఎస్ కార్యకర్త మల్లేష్ హత్యను తీవ్రంగా ఖండించారు. అంతేకాదు గత ఆదివారం మల్లేష్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించారు మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్‌నేత మల్లు రవి. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను..రాజకీయ హత్యగా చూపే ప్రయత్నం చేస్తున్నారనీ.. ఆరోపించారు. కాగా.. మల్లేష్ హత్య ఘటనపై బీఆర్ఎస్ నేతలు డీజీపీకి ఫిర్యాదు చేశారు. మొన్న నాగర్ కర్నూల్ జిల్లా.. తాజాగా సిరిసిల్లలో కేటీఆర్ పర్యటనతో క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు భరోసాను ఇస్తూ.. లోకసభ ఎన్నికలకు క్యాడర్‌ను సంసిద్ధం చేసేలా బీఆర్ఆర్ ప్రణాళికలకు పదనుపెడుతోంది.

# హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్

దావోస్ వేదికగా ఏర్పాటుకు సెఐం సమక్షంలో ఒప్పందం♦బయో ఏషియా-2024 సదస్సులో ఫిబ్రవరి 28న ప్రారంభం




హైదరాబాద్,జనవరి 16 (సమ సమాజం): వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో తెలంగాణకు అరుదైన అవకాశం దక్కింది. ప్రపంచ ఆర్థిక సదస్సు ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ హైదరాబాద్‌లో ప్రారంభించేందుకు ఒప్పందం చేసుకున్నారు. బయో ఏషియా-2024 సదస్సులో భాగంగా ఫిబ్రవరి 28న ఈ సెంటర్ ప్రారంభం కానుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచే స్టేట్ హెల్త్ టెక్ ల్యాండ్ స్కేప్ సాంకేతిక ఆధారిత కార్యక్రమం రూపుదిద్దుకోనుంది. స్విట్జర్లాండ్ లోని దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రెసిడెంట్ బోర్గే బ్రెండే ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి టీమ్ చర్చలు జరిపింది. అనంతరం హైదరాబాద్ లో ప్రారంభించడంపై సంయుక్తంగా ఈ ప్రకటన చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో టెక్నాలజీ కలయికతో అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తెలంగాణకు విశిష్ట సహకారం అందించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ విశాల దృక్పథం, నిర్దేశించుకున్న లక్ష్యాలన్నీ తెలంగాణ ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా ఉన్నాయని, అందుకే రెండింటి మధ్య అద్భుతమైన సమన్వయం కుదిరిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జీవన విధానాలు, జీవన నాణ్యత ప్రమాణాలు మెరుగుపరిస్తే ప్రజల జీవితాలు బాగుపడుతాయనే ఆలోచనల సారూప్యతకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రపంచ స్థాయిలో పని చేస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలపై దృష్టి కేంద్రీకరిస్తోందన్నారు. ఇరువురి భాగస్వామ్యంతో ప్రజల ఆరోగ్యం, సాంకేతికత, మంచి జీవితం అందించాలనే లక్ష్యాలను వేగంగా అందుకోవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ విధానాలను సరికొత్తగా పునర్నిర్వించే ఆలోచనలు ఉన్నాయని.. చిన్న పట్టణాలు, గ్రామాలకు ఈ సేవలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. హెల్త్ టెక్‌హబ్‌గా తెలంగాణను ప్రపంచ గమ్యస్థానంగా మార్చటంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఈ సేవలను అందించే సంకల్పంతో పని చేస్తుందని పేర్కొన్నారు. హెల్త్ టెక్, లైఫ్ సైన్సెస్ భవిష్యత్తుకు నాయకత్వం వహించేందుకు సరిపడేన్ని అవకాశాలెన్నో భారతదేశానికి ఉన్నాయని, అందులో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సెంటర్ ఫర్ హెల్త్ అండ్ హెల్త్‌కేర్ హెడ్, ఎగ్జ్యూటివ్ కమిటీ మెంబర్ డాక్టర్ శ్యామ్ బిషెన్ అన్నారు. ప్రపంచంలోనే మొదటి ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా ఏర్పాటుతో తెలంగాణ మరింత కీలకంగా మారనుంద న్నారు. ప్రభుత్వ రంగంతో పాటు స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ మధ్య సమన్వయ సహకారం కుదర్చటంతో పాటు ఆరోగ్య సంరక్షణ విభాగంలో ఉద్యోగాల కల్పనకు మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. ఫోరమ్ అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న డిజిటల్ హెల్త్‌కేర్ ట్రాన్స్ఫర్మేషన్ లక్ష్యం నెరవేరుతుందనే విశ్వాసముంచారు. దీంతో రోగులకు మెరుగైన సేవలు అందించడం, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణలో సాంకేతిక విధానాలకు చొరవ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ఈ కేంద్రం ప్రారంభమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రభావాన్ని మరింత పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలను అందజే స్తుందని అని డాక్టర్ శ్యామ్ బిషెన్ హర్షం వ్యక్తం చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్ నెట్‌వర్క్ అయిదు ఖండాలలో విస్తరించింది. తెలంగాణ సెంటర్.. ప్రపంచంలో 19వది. హెల్త్‌కేర్ మరియు లైఫ్ సైన్సెస్ నేపథ్యంతో ఉన్నమొదటి కేంద్రం హైదరాబాద్లోనే ప్రారంభమవనుంది. ఆసియాలోనే తెలంగాణ ప్రముఖ లైఫ్ సైన్సెస్ హాట్‌స్పాట్‌గా పరిగణిస్తారు. దీనికి స్వయం ప్రతిపత్తి ఉంటుంది. ఇది లాభాపేక్ష లేని సంస్థ. ఆరోగ్య సంరక్షణ మరియు లైఫ్ సైన్సెస్ కోసం పాలసీ, పాలనపై నాయకత్వం వహిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ఇంక్యుబేటర్ల ద్వారా రాబోయే 5 సంవత్సరా లలో 20,000 స్టార్టప్‌లపై ప్రభావం చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో దాదాపు సగం మంది ఉద్యోగులు ఫార్మా, మెడ్‌టెక్ మరియు బయో టెక్నాలజీ రంగాలలో పని చేస్తున్నారు. హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ అ4ఎఖీ ప్రారంభంతో మరిన్ని ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయి. ఆరోగ్య సంరక్షణలో కొత్త సాంకేతిక విధానాలు అందుబాటులోకి వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది.

# పార్లమెంట్ ఎన్నికలపై బిజెపి కసరత్తు

ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ నేతలు



హైదరాబాద్,జనవరి 16 (సమ సమాజం): తెలంగాణ బీజేపీ నేతలు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. పార్లమెంట్ ఎన్నికలపై అన్ని రాష్ట్రాల నేతలతో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమవుతున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ వ్యూహంపై చర్చించనున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్ రెడ్డి, బంగారు శృతి , కాసం వెంకటేశ్వర్లు, ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు హాజరుకానున్నారు. తెలంగాణలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలను 3 లేదా 4 పార్లమెంటులను కలిపి ఒక క్లస్టర్‌గా బీజేపీ ఏర్పాటు చేసింది. క్లస్టర్‌లకు ప్రేమేందర్ రెడ్డి, బంగారు శృతి , కాసం వెంకటేశ్వర్లు. ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు ఇన్చార్జిలుగా ఉన్నారు. అలాగే ఢిల్లీలో సాయంత్రం బీజేపీ రాష్ట్ర నేతలతో ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి సునీల్ బన్సల్ తరుణ్ చుగ్ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU,*
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in